# గ్రామీణుల్లో ఆర్థిక నైపుణ్యత లక్ష్యంగా ఆర్బిఐ చర్యలు

- గ్రామీణ బ్యాంకుల చేయూతతో మెరుగైన ఆర్థిక నిర్ణయాలు
- ఆర్బిఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్



సిద్ధిపేట జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి నగేష్):

ఆర్థిక అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం కానుండగా, గ్రామీణుల్లో ఆర్థిక నైపుణ్యత లక్ష్యంగా ఆర్బిఐ చర్యలు చేపట్టినట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు వినియోగదారులు, మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక నైపుణ్యతతో గ్రామీణ మహిళలు సమర్థవంతంగా తమ ఆర్థిక భవిష్యత్తును నిర్మించుకోగలుగుతారని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్బిఐ తగిన నిబంధనలు రూపొందించి వినియోగదారుల లక్ష్యంగా చైతన్యం చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు రుణాలు, ఆర్థిక ఉత్పత్తులు, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక రక్షణ, భీమా, పెన్షన్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణుల్లో పొదుపు సంస్కృతిపై విస్తృత చైతన్యం చేస్తూ ఆ సొమ్ముకు ముప్పు వాటిల్లకుండా దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అనవసర లింకులు ఓపెన్ చేయకుండా, ఓటీపీలు, పాస్వర్డ్లు ఇతరులకు చెప్పకుండా నేరుగా బ్యాంకులను సంప్రదిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని అన్నారు. ఖాతాదారులు తమ అకౌంట్లకు కేవైసీ చేయించు కోవడంతోపాటు చైతన్యంతో డిజిటల్ లావాదేవీలు చేపట్టాలని, బ్యాంకులలో వినియోగంలో లేని ఖాతాలను రద్దు తీసుకొని పక్ష%శీ%లో ఆ ఖాతాలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాగా బ్యాంకర్లు సమస్యలు సృష్టించి ఇబ్బందులు కలిగిస్తే అందుబాటులో ఉన్న ఫిర్యాదు బాక్సులో ఉత్తరం ముక్క వేయాలని, సమస్య తీవ్రతను బట్టి ఆర్బిఐ అంబుడ్స్ మెన్ ను కూడా కలువచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిఐ జనరల్ మేనేజర్ సుప్రభాత్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గోమతి, లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఉదయ్ కిరణ్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ నర్సింలు పాల్గొన్నారు.